
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
బుధవారం 31 జనవరి 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 70

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.131	190	216
సూర్యాపేట	రూ.130	190	210
నల్లగొండ	రూ.129	187	213

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 | కనిష్ఠం 20.0

కుష్ఠువ్యాధి విజృంభణ



● రెట్టింపైన వ్యాధిగ్రస్తులు ● ప్రారంభమైన అవగాహన కార్యక్రమం

తగ్గుముఖం పడుతుందనుకున్న కుష్టు వ్యాధి జిల్లాలో మళ్లీ విజృంభిస్తోంది. ఏడాది వ్యవధిలో వ్యాధిగ్రస్తుల సంఖ్య రెట్టింపు కావడం ఆందోళన కలిగిస్తున్న అంశం. వ్యాధి లక్షణాలు కలిగిన వారు ఏ మాత్రం నిర్లక్ష్యం చూపినా శాశ్వత అంగ వైకల్యం బారినపడే ప్రమాదం ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ అవగాహనా రాహిత్యంతో పాటు పలు కారణాలతో వ్యాధి లక్షణాలు సోకిన వారు చికిత్సకు దూరంగానే ఉంటున్నారు.

● భువనగిరి టౌన్

కుష్టు అంటువ్యాధి కానప్పటికీ రోగులపట్ల సమాజం వివక్ష చూపుతున్న పరిస్థితులు అనాదినుంచి ఉన్నాయి. అయితే వివక్షకు గురవుతున్న రోగులపట్ల మహాత్మా గాంధీ వాత్సల్యం చూపి స్వయంగా సేవలు కూడా అందించారు. అలాగే పలు ప్రాంతాల్లో వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపారు. దీంతో మహాత్మాగాంధీ వర్ధంతి నుంచి ప్రతీ సంవత్సరం 13 రోజులపాటు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ మేరకు మంగళవారం జిల్లాలో కుష్టు వ్యాధి నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

ప్రతీ గ్రామంలో..

జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఈ నెల 30 నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బృందాల్లో వైద్య సిబ్బందితోపాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. బృందాలు ఎంపిక చేసిన గ్రామంలో ముందురోజు సమాచారం ఇచ్చి మరుసటి రోజు ఇళ్లిల్లు తిరిగి, లేదా నిర్దేశిత ప్రాంతాల్లో ప్రజలను ఒకదగ్గర చేర్చి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తారు. రోగ లక్షణాలు, చికిత్సలు, మందులను వివరిస్తారు. వ్యాధి లక్షణాలను వివరించి అనుమానాస్పదులుగా గుర్తించిన వారిని ఆస్పత్రులకు తరలించి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే ముందుగా అవగాహన కల్పించి తగ్గేవరకూ ఉచితంగా చికిత్సలు, మందులు అందిస్తారు. వ్యాధిని రెండు కేటగిరీలుగా పాసీబాసిల్లరీ లెప్రసీ (పీబీ), మల్టీ బాసిల్లరీ లెప్రసీ (ఎంబీ) పరిగణిస్తారు. పీబీకి ఆరు నెలలు, ఎంబీకి 12 నెలల చికిత్సను అందిస్తారు. ఆ వ్యవధిలో వ్యాధి పూర్తిగా తగ్గుముఖం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో రెట్టింపైన వ్యాధిగ్రస్తులు

జిల్లాలో గత మూడేళ్లతో పోలిస్తే కుష్టువ్యాధిగ్రస్తుల సంఖ్య క్రమేపీ పెరుగుతుండడం విచారకరం. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా వ్యాధిగ్రస్తుల సంఖ్య రెట్టింపు కావడం వ్యాధి విజృంభణను తెలియజేస్తోంది. గాలిద్వారా ప్రవహించే మైక్రో బ్యాక్టీరియా లెప్రా ద్వారా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఈ వ్యాధి సోకుతుంది. వైద్య చికిత్సలు, మందులతోపాటు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాల్సి ఉంటుంది. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలి. దగ్గు, తుమ్ములు వచ్చినప్పుడు విధిగా ముక్కుకు, నోటికి చేతులను లేదా చేతిరుమాల్‌ను అడ్డం పెట్టుకొని, ఆ వెంటనే సబ్బుతో శుభ్రం చేయగలిగితే వ్యాధి నియంత్రణ, నివారణ సాధ్యమవుతుందని వైద్య నిపుణులు అంటున్నారు.

సంవత్సరం	వ్యాధిగ్రస్తులు
2020-21	33
2021-22	36
2022-23	71

జిల్లాలో మూడేళ్లుగా ఇలా..

జిల్లాలో గత మూడేళ్లతో పోలిస్తే కుష్టువ్యాధిగ్రస్తులు క్రమేపీ పెరుగుతున్నారు. ఏడాదిలో ఏకంగా వ్యాధిగ్రస్తుల సంఖ్య రెట్టింపు కావడం కుష్టు వ్యాధి ఏ విధంగా పెరుగుతోందో అర్థం చేసుకోవాలి.



పోచంపల్లిలో కుష్టు నివారణ మెడికల్ కిట్‌ను అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

జాగ్రత్తలతో నివారణ సాధ్యం



వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించగలిగితే నివారణ సాధ్యమే. వ్యాధి సోకినప్పటికీ తీవ్రత ఆధారంగా చికిత్సలు తీసుకుంటే పూర్తిగా నివారించవచ్చు. అయితే వ్యాధి సోకిన వారు జీవితం కాలం పాటు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అంటువ్యాధి కాదు జిల్లాలో కుష్టువ్యాధిపై అవగాహన కల్పించేందుకు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

డాక్టర్ వై.పాపారావు, జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి

అంగన్‌వాడీలా



భువనగిరి అర్బన్, జనవరి 30: అంగన్‌వాడీ కేంద్రాలు డీలా పడుతున్నాయి. మౌలిక వసతులు లేకపోవడం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో చిన్నారులకు పౌష్టికాహారం అందని ద్రాక్షగానే మారుతోంది. దీంతో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషకాహార లోపంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారం అందించాలనే సంకల్పంతో అంగన్‌వాడీలను అందుబాటులోకి తెచ్చారు. ఇందుకోసం ప్రతీ సంవత్సరం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఇటీవల ప్రజాప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం మినీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసింది. కాగా క్షేత్ర స్థాయిలో ఈ కేంద్రాల అభివృద్ధికోసం చర్యలు చేపట్టిన దాఖలాలు కన్పించడంలేదు.

లబ్ధిదారులు	
ఏడు నెలల నుంచి మూడేళ్ల చిన్నారులు	26,977
మూడు నుంచి ఆరేళ్లలోపు..	18,487
గర్భిణులు	5,179
బాలింతలు	3,694

అంగన్‌వాడీ కేంద్రాలు.. వాటి వివరాలు	
ప్రాజెక్టులు	4
అంగన్‌వాడీ కేంద్రాలు	901
సొంత భవనాలు	234
ప్రభుత్వ, ఇతర భవనాలు	433
అద్దె భవనాలు	243
విద్యుత్ లేని భవనాలు	577
ఇంకుడు గుంతలు లేనివి	901
మరుగుదొడ్లు లేనివి	461
ప్రహరీలు లేనివి	418

పోషకాహార లోపం చిన్నారులు	
పోషకలోపంతో బాధపడేవారు	141
మాధ్యమికలోపం	529
అతితీవ్ర పోషణ లోపం	126

సమస్యలతో సహవాసం

జిల్లా వ్యాప్తంగా 901 కేంద్రాలకు 234 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. దీంతోపాటు 418 భవనాలకు ప్రహరీలు లేవు. చాలాచోట్ల నీటి వసతి లేకపోగా, విద్యుత్ సరఫరా లేని భవనాలు 577 ఉన్నాయి. ఈ కేంద్రాల నిర్వహణ తలనొప్పిగా మారింది. ఇలాంటి లోటుపాట్ల నడుమ కొనసాగుతున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వాలు దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని పలువురు పేర్కొంటున్నారు.

కనీసం మరుగుదొడ్లు లేవు

కనీసం మరుగుదొడ్లులేని కేంద్రాలు 461 ఉండగా, ఇక్కడకు వచ్చే మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 36 మంది టీచర్, 129 మంది ఆయా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. సరైన పోషకాహారం అందించేందుకు కనీసం నియమకాలు త్వరగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. అధికారులనుంచి ఆదేశాలు రాగానే అభివృద్ధి పనులు చేపడతాం. కేంద్రాల సంక్షేమ కోసం ఉన్నతాధికారుల నిర్ణయాలు అమలుచేస్తున్నాం. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషకాహార పంపిణీపై పర్యవేక్షిస్తున్నాం. సిబ్బంది పొరపాట్లు, కేంద్రాల్లోని లోపాలను నిర్మూలించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం.

● జి. అన్నపూర్ణ, మహిళా, శిశు సంక్షేమ అధికారి, యాదాద్రి

జంతు సంరక్షణ అందరి బాధ్యత

● వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేయాలి ● కలెక్టర్ హనుమంతు కే.జెండగే



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జనవరి 30: జంతు సంక్షేమంపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జంతుహింస నివారణ కమిటీ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు పక్షం రోజుల కార్యక్రమంలో భాగంగా జంతువులపై క్రూరత్వ నివారణ అంశాలపై జిల్లాస్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. కరపత్రాల ద్వారా జంతు సంక్షేమ చట్టాలపై అవగాహన కలిగించాలన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. జంతువులను అక్రమంగా వధించడాన్ని, అక్రమ రవాణాను నిరోధించేలా పోలీసు, రవాణా శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. పశువుల సంతలో సౌకర్యాలు, భద్రత కల్పించడమే గాక రేబిస్ వ్యాధి నివారణకోసం మునిసిపాలిటీలు, గ్రామాల్లో పెంపుడు, వీధికుక్కలకు నిరంతరాయంగా, సామూహికంగా టీకాలు వేయాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటితొట్లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, జడ్పీ సీఈవో సీహెచ్ కృష్ణారెడ్డి, పశు సంవర్ధక అధికారి డాక్టర్ కృష్ణ, భువనగిరి ఏసీపీ ఎస్.వెంకట్‌రెడ్డి, ఆర్డీవో జి.రవీందర్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మహేష్ అగర్వాల్, గోశాల ఫెడరేషన్ అధ్యక్షుడు బిగణేష్, జంతు సంక్షేమ బోర్డు అధికారి హరీష్, సభ్యురాలు పి.పావని, మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి, పౌర సంబధాల అధికారి పి.వెంకటేశ్వర్లు, విద్యాశాఖ ఏడీ ప్రశాంత్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అమరవీరులకు నివాళి

స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించిన అనంతరం శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏ.భాస్కర్‌రావు, డీఆర్వో పద్మజారాణి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రామ్మూర్తి, గిరిధర్, రామారావు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా పోటాపోటీ నిరసనలు

● జడ్పీ చైర్మన్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతలు ● మంత్రి వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు
● ఇరువురు నేతల దిష్టిబొమ్మల దహనం ● మంత్రిపై డీజీపీకి ఫిర్యాదు చేసిన సందీప్‌రెడ్డి

జిల్లాలో మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నిరసనలు పోటాపోటీగా కొనసాగాయి. బీబీనగర్ మండలం గూడూరులో ఈ నెల 29న జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి మధ్య వాడివాడి చర్చ కొనసాగింది. వాదన తీవ్రస్థాయికి చేరడంతో అక్కడున్న పోలీసులు సందీప్‌రెడ్డిని అక్కడి నుంచి పంపించేశారు. దీంతో మంగళవారం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు, కాంగ్రెస్ నేతలు ఇరుపార్టీల నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

వివరాలు 7లో..

మునిసిపాలిటీల్లో.. ఫిరాయింపులు షురూ

● త్వరలోనే మరిన్ని ఫిరాయింపులంటూ ప్రచారం
● చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ
● ఆరు నెలలుగా జరగని కౌన్సిల్ సమావేశాలు.. గాడి తప్పిన పురపాలన



భువనగిరి టౌన్, జనవరి 30: భువనగిరి మునిసిపల్ అవిశ్వాస రాజకీయాలు ముదిరి పాకాన పడుతున్నాయి. ఈ నెల 23వ తేదీన అవిశ్వాస తీర్మానం నెగ్గిన నేపథ్యంలో త్వరలోనే నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ రానుండడంతో కౌన్సిలర్ల ఫిరాయింపులు మొదలయ్యాయి. స్థానిక 11వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ జిట్టా వేణుగోపాల్‌రెడ్డి, బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అయితే అతను కాంగ్రెస్ నుంచే గెలుపొందినప్పటికీ అనంతరం మునిసిపాలిటీలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో చేరి, తిరిగి సొంత గూటికి చేరాడు. కానీ ఈ పరిణామంతో త్వరలో మరింత మంది పార్టీ ఫిరాయించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారమవుతోంది. దీంతో మునిసిపల్ రాజకీయాలు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే సమ్మతి, అసమ్మతివాదులతో కకావికలంగా ఉన్న బీఆర్ఎస్ నుంచి పార్టీ ఫిరాయింపులు పెరుగనున్నట్లు తెలుస్తోంది. దీంతో చైర్మన్, వైస్‌చైర్మన్ ఆశావాహుల్లో ఆందోళన నెలకొంది. ఇదే అదునుగా మరికొంతమంది కౌన్సిలర్లు తమ డిమాండ్‌ను పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, కాంగ్రెస్‌మాత్రం రాజకీయాల్లో ఈ పరిణామాలు సర్వసాధారణమేనని పేర్కొంటుంది.

కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి ఫిరాయింపులే..

కౌన్సిల్ ఎన్నికల్లో 35 మంది సభ్యులకు బీఆర్ఎస్ నుంచి 15 మంది, కాంగ్రెస్ నుంచి 11 మంది, బీజేపీ నుంచి ఏడుగురు, ఇద్దరు స్వతంత్రులు గెలుపొందారు. బీఆర్ఎస్ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా నిలిచినప్పటికీ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన మెజార్టీ రాకపోవడంతో ఇద్దరు స్వతంత్రులను బీఆర్ఎస్‌లో చేర్చుకొని, మరో విపక్ష సభ్యుడి పరోక్ష సహకారం, అప్పటి ఎక్స్‌అఫీషియో సభ్యులైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకారంతో మునిసిపాలిటీపై గులాబీ జెండాను ఎగురవేశారు. తదనంతరం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, బీజేపీకి చెందిన మరో సభ్యుడు బీఆర్ఎస్ గూటికి చేరడంతో కౌన్సిల్‌లో ఆ పార్టీ సంఖ్యా బలం 20కి చేరగా కాంగ్రెస్ 9కి బీజేపీ 6కు పరిమితమై స్వతంత్రులు లేకుండా అయింది. తాజా పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ సమ్మతి, అసమ్మతి కౌన్సిలర్లను కలుపుకొని ఆ పార్టీకి సంఖ్యాబలం 19కి చేరగా కాంగ్రెస్ సంఖ్య 10కి పెరిగింది. కానీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నాటికి పార్టీల సంఖ్యాబలాల్లో గణనీయ మార్పు రానున్నట్లు ప్రచారమవుతోంది. దీంతో ఏ పార్టీ నుంచి ఫిరాయింపులు అధికంగా ఉండబోతున్నాయోనని పలువురు చర్చించుకుంటున్నారు. ఫిరాయింపులు షురువైన నేపథ్యంలో తమ సభ్యులను కాపాడుకునేందుకు ఆయా పార్టీల నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అన్ని పార్టీల ముఖ్య నాయకులు మంగళవారం వేర్వేరుగా అంతరంగిక సమావేశాలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించుకున్నారు.



ఎమ్మెల్యే కుంభం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి

ఆగస్టు 17న చివరి కౌన్సిల్ సమావేశం

పట్టణ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రతీనెల కౌన్సిల్ సమావేశమై చర్చించి పరిష్కరించాల్సి ఉంటుంది. నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చర్చించి ఆమోదించాల్సి ఉంటుంది. కానీ భువనగిరి మునిసిపల్ కౌన్సిల్ సాధారణ చివరి సమావేశం ఆగస్టు 17న జరగగా, అప్పటి నుంచి సమావేశాల ఊసే లేదు. అసెంబ్లీ ఎన్నికల కోడ్‌కు తోడు, అవిశ్వాస రాజకీయాల నేపథ్యంలో డిసెంబరు 22న జరగాల్సిన సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. దీంతో మునిసిపల్ పాలన గాడి తప్పింది. అప్పటినుంచి మునిసిపల్ కార్యాలయానికి వచ్చే కౌన్సిలర్ల సంఖ్య తగ్గడంతో సిబ్బందిలో కూడా అలసత్వం పెరిగినట్లు ప్రచారమవుతున్నది. ఆరు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు లేకపోవడంతో పలు బిల్లులు, నూతన పనులు ఆమోదానికి నోచక మూలనపడ్డాయి. దీంతో ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల్లో నిధుల కొరతతోపాటు పలు సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతూ అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతుంది. మునిసిపల్ కార్యకలాపాలు సక్రమంగా కొనసాగితే ఫిబ్రవరి మొదటి వారంలో వార్షిక బడ్జెట్ సమావేశం జరుగాల్సి ఉండేది. కానీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక అనంతరమే బడ్జెట్ సమావేశంతోపాటు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

బీఎన్ తిమ్మాపూర్ ప్రజల త్యాగం మరువలేనివి

● ముంపు నిర్వాసితులకు అండగా ఉంటాం ● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



బీఎన్ తిమ్మాపూర్ నూతన కాలనీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



వేదికపై కుర్చీలు లేకపోవడంతో మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి, ఎంపీడీవో గుత్తా నరేందర్‌రెడ్డి వేదిక వెనకాల నిల్చోవాల్సి వచ్చింది.(సర్కిల్‌లో)

భువనగిరి రూరల్, జనవరి 30: బీఎన్ తిమ్మాపూర్ ప్రజల త్యాగాలు మరువలేనివని, ముంపు నిర్వాసితులకు అండగా ఉంటానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎత్తిపోతల్లో భాగంగా బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులకోసం భువనగిరి పట్టణ పరిధిలోని హుస్సేనాబాద్ శివారులో సర్వే నెం.107లో పునరావాసం కోసం ఏర్పాటు చేసిన నూతన కాలనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పునరావాసం కింద ప్రభుత్వం కేటాయించిన లేఅవుట్‌లో అన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం రీడిజైన్ పేరుతో 0.8 టీఎంసీ సామర్థ్యం గల ప్రాజెక్టను కమీషన్ల కోసం 11.39టీఎంసీలకు పెంచి గ్రామాలను ముంపునకు గురి చేసిందన్నారు. ఇప్పటికే మేడిగడ్డ కుంగిపోయిందని, నీళ్లు రాని ప్రాజెక్టులు కట్టేందుకు ప్రయత్నించి గ్రామాలను ముంపునకు గురిచేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు మల్లన్న సాగర్ నిర్వాసితులకు అందజేసిన విధంగా మరో రూ.5.4లక్షలు ఇవ్వాలని, లేఅవుట్ సమీపంలో ఉన్న సమాధులను, శ్మశాన వాటికను తొలగించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పీఆర్ డిప్యూటీ ఈఈ కూరెళ్ల గిరిధర్, ప్రాజెక్ట్ ఈఈ ఖుర్షిద్, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, ఎంపీపీ నరాల నిర్మల, సర్పంచ్ పిన్నం లతా రాజు, ఎంపీటీసీ ఉడుత శారద ఆంజనేయులు, కౌన్సిలర్ గుండెగల్ల అంజమ్మ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, దర్శన్‌రెడ్డి, వల్దాస్ రాజు, రావుల నందు, జిన్న మల్లేశం, పోత్నక్ ప్రమోద్ కుమార్, తంగెళ్లపల్లి రవి, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, ప్రదీప్, నర్సింహ పాల్గొన్నారు. అదే విధంగా భువనగిరి పట్టణ పరిధిలోని హుస్సేనాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కాలనీలో 2009 సంవత్సరంలో నిరుపేదలకు ఇచ్చిన ప్లాట్‌లను వారికే కేటాయించాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు మండలంలోని వడపర్తి, బండసోమారం, వీరవెల్లి, తుక్కాపూర్, నమాత్‌పెల్లి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు

వలిగొండ: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు కాంగ్రెస్‌లో చేరుతున్నారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నర్సయ్యగూడెం గ్రామసర్పంచ్ తుమ్మల దామోదర్ బీఆర్ఎస్‌ను వీడి సుమారు 50 మందితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వ అవినీతి వల్లే రాష్ట్రం దివాలా తీసిందన్నారు. పార్టీలో చేరిన వారిలో మాదాను బాలశౌరి, కాట బాలరాజు, పసల ఆరోగ్యయ్య, పసల అర్జయ్య, తుమ్మల సంతోష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పసల జ్యోతి, పాశం సత్తిరెడ్డి, గరిసె రవి, తుమ్మల శ్రీను, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు బైక్ నడపడం నేరం : డీటీవో



అవగాహన కల్పిస్తున్న డీటీవో రవీందర్

వలిగొండ, జనవరి 30: మైనర్లు బైక్ నడపడం చట్టరీత్యా నేరమని జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీవో) గంటా రవీందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పాఠశాలలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ మైనర్లు ద్విచక్రవాహనాలు నడిపి ప్రమాదానికి కారణమైతే తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగిరిగుట్టకు బస్సు నడపాలి

వలిగొండ, జనవరి 30: మండలంలోని మత్స్యగిరి గుట్టవరకు బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బండారు నర్సింహారెడ్డి, మత్స్యగిరి దేవస్థానం మాజీ ధర్మకర్త లింగయ్య యాదవ్ కోరారు. మంగళవారం యాదగిరిగుట్ట డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యగిరిగుట్టకు అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారని, బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల మహిళలు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. మత్స్యగిరిగుట్ట వరకు స్పెషల్ బస్సును ఏర్పాటు చేయాలని డీఎంను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు ఆవుల సత్యనారాయణ, నాయకులు మల్లేశ్, అంజయ్య, సుధాకర్, నర్సయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో క్షేత్రపాలకుడికి ఆకుపూజ

యాదగిరిగుట్ట, జనవరి 30: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనృసింహుడికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని అర్చక స్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. అంజనేయుడి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, అష్టభుజి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు సంప్రదాయరీతిలో కొనసాగాయి.

కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, ముఖమండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయంలో పుష్కరిణి, ప్రధానాలయంలోని, కొండపైన శివాలయంలోని అంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.20,09,970 ఆదాయం సమకూరిందని దేవస్థాన అధికారులు తెలిపారు.



తిరువీధుల్లో లక్ష్మీనృసింహుల అలంకార జోడు సేవలను ఊరేగిస్తున్న అర్చకులు



మోత్కూరులో గోదాం వద్ద క్యూలో ఉంచిన సిలిండర్లు, ఎదురు చూస్తున్న వినియోగదారులు

వంట గ్యాస్ కోసం తిప్పలు

మోత్కూరు జనవరి 30: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు. మోత్కూరు భారత్ గ్యాస్ గోదాంకు సిలిండర్ల లోడ్ వస్తుందని తెలియడంతో వినియోగదారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులుకాశారు. లోడ్ లారీ(524 సిలిండర్లు) రాగానే సిలిండర్లను గోదాంలో దించకుండా, డోర్ డెలివరీ వాహనాల్లో లోడ్ చేయకుండా అడ్డుకుని లారీ నుంచే నేరుగా సిలిండర్లు తీసుకున్నారు. ఉదయం నుంచి క్యూలో నిల్చున్నా చివరన ఉన్న వారికి సిలిండర్లు అందక ఖాళీ సిలిండర్ తీసుకొని వెళ్లిపోయారు.



కాపర్‌వైర్ చోరీ ముఠా అరెస్టు

మిర్యాలగూడ అర్బన్, జనవరి 30: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైరును కాజేసే దొంగల ముఠాను నల్లగొండజిల్లా మిర్యాలగూడ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటగిరి కేసు వివరాలు వెల్లడించారు. నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కుంచం కోటేష్, రూపాని గోపి, కూసాని నాగయ్య, వరికుప్పల శ్రీను, వరుసు నాగరాజు, కుంచం విజయ్ ముఠాగా ఏర్పడి డివిజన్‌లోని ఏడు చోరీలకు పాల్పడ్డారు. ఇప్పటివరకు మిర్యాలగూడ, వేములపల్లి, త్రిపురారం, నేలకొండపల్లితో కలిపి మొత్తం ఏడు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి దొంగిలించిన కాపర్‌వైర్‌ను వెంటనే విక్రయిస్తే పట్టుబడుతామన్న భయంతో రహస్యంగా దాచిపెట్టారు. అందులో కొంత వైరును మిర్యాలగూడ పట్టణంలో విక్రయించేందుకు నిందితులు రెండు ద్విచక్రవాహనాలపై వస్తూ వాహన తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను అంగీకరించారు. వారి నుంచి రూ.3లక్షల విలువైన 305కిలోల కాపర్‌వైర్, మూడు ద్విచక్రవాహనాలు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసునమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. దొంగల ముఠా గుట్టురట్టు చేసేందుకు డీఎస్పీ ఆధ్వర్యంలో పనిచేసిన బృందంలోని టూటౌన్ సీఐ నర్సింహారావు, ఎస్‌ఐలు కృష్ణయ్య, రాంబాబు, విజయ్‌కుమార్, వీరశేఖర్, హెచ్‌సీ వెంకటేశ్వర్లు, పీసీలు రవి, నరేష్‌కుమార్, అక్బర్, రామకృష్ణలను ఎస్పీ చందనదీప్తి అభినందించారు.

సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి



హైదరాబాద్‌లో డీజీపీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దేవరకొండ, జనవరి 30: యాదాద్రిభువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీపై అడిగితే ఓపికతో సమాధానం చెప్పాల్సిన మంత్రి సహనం కోల్పోయి మాట్లాడడం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలు అమలు చేయాలని అడిగిన ప్రతిపక్ష పార్టీలతో మాట్లాడే వ్యవహారశైలి సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు టీవీఎన్ రెడ్డి, హనుమంతు వెంకటేష్‌గౌడ్, సుభాష్, గాజుల ఆంజనేయులు, రాజేష్, అనంతగిరి, ప్రతాప్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మల్లారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

సూర్యాపేట(కలెక్టరేట్): మంత్రి వెంకట్‌రెడ్డి వీధి రౌడీలా ప్రవర్తిస్తూ బీఆర్ఎస్ నాయకులను అవమానించి, దాడులకు ఉసిగొల్పుతున్నారని బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించినందుకు భువనగిరి జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డిపై దాడి చేయించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టి పోలీసులతో ఏకమై గూండాయిజం చేయడం తగదన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే దాడి చేస్తారా అని జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నెమ్మాది భిక్షం, ఉప్పల ఆనంద్, కోడి సైదులుయాదవ్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్: జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జడ్పీచైర్మన్‌ను అవమానించే విధంగా మంత్రి మాట్లాడడం తగదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు డిల్లీ మాధవరెడ్డి, ముప్పిడి శ్రీనివాస్, బొడిగే ఆనంద్, మల్లేశ్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: యాదాద్రి జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై మాట్లాడే నైతిక హక్కు మంత్రి కోమటిరెడ్డికి లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు నోముల శంకర్‌యాదవ్, బాషబోయిన లింగస్వామి, క్రాంతి కుమార్, గంట కిరణ్, గణేష్, శ్రీకాంత్, నానియాదవ్, శివకుమార్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: ప్రభుత్వ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో పక్షపాత ధోరణితో వ్యవహరించిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీజీపీ రవిగుప్తాకు బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల బృందం మంగళవారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరులో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగంపై ప్రశ్నిస్తున్న జడ్పీచైర్మన్‌పై స్థానిక పోలీస్ అధికారులు దురుసుగా వ్యవహరించడం సరికాదన్నారు. విచారణ చేపట్టి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, జడ్పీ చైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి గుజ్జ దీపిక, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లబోతు భాస్కర్‌రావు శానంపూడి సైదిరెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి ఉన్నారు. అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని యాదాద్రిభువనగిరి జడ్పీ వైస్‌చైర్మన్ ధనావత్ భీకూనాయక్ డిమాండ్ చేశారు. జడ్పీ కార్యాలయంలో భువనగిరి, యాదగిరిగుట్ట, రాజాపేట జడ్పీటీసీలు సుబ్బూరు బీరు మల్లయ్య, తోటకూరి అనురాధ, చామకూర గోపాల్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడువక ముందే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దురుసుగా వ్యవహరించడం సరికాదన్నారు. మంత్రికి సమాన హోదా కలిగిన జడ్పీ చైర్మన్‌ను అవమాన పర్చడం సరికాదన్నారు.

బొమ్మలరామారం: మంత్రి వెంకట్‌రెడ్డి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని కించపరిచే వాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల నాయకులు అన్నారు. జడ్పీచైర్మన్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండలకేంద్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సందీప్‌రెడ్డి ఎదుగుదలను చూసి ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోలగోని వెంకటేష్‌గౌడ్, ఎంపీపీ సుధీర్‌రెడ్డి, గూదె బాలనర్సింహ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దూషించడం సరికాదని ఎంపీపీ మాద్గుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. భూదాన్‌పోచంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. అహంకార పూరితంగా వ్యవహరిస్తే ప్రజలే తిరగబడతారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, కోట మల్లారెడ్డి, కందాడి భూపాల్‌రెడ్డి, బత్తుల మాధవి శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని విమర్శించడం తగదు : బీర్ల



బొమ్మలరామారంలో సందీప్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తుర్కపల్లి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై మాజీమంత్రి జగదీష్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన నాయకుడిని ఇష్టారాజ్యంగా విమర్శించడం సిగ్గుచేటని, మాజీమంత్రికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

బొమ్మలరామారం: జడ్పీ చైర్మన్‌గా ఉంటూ సొంత గ్రామానికి రోడ్డు కూడా వేయలేని సందీప్‌రెడ్డికి మంత్రి కోమటిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. సొంత గ్రామం వడపర్తి నుంచి చీకటిమామిడి వరకు డబుల్ రోడ్డు వేస్తానని హామీ ఇచ్చి నెర వేర్చలేని సందీప్‌రెడ్డి మంత్రిపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మర్రి భగవంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, దేశెట్టి చంద్రశేఖర్, రఘు, బాసరమ్ బాబు, కుమార్, మహేష్‌గౌడ్, యాదయ్య, హేమంత్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ఆరుగురిని బలితీసుకున్న లారీ సీజ్

మిర్యాలగూడ అర్బన్, జనవరి 30: రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురిని బలిదీసుకున్న లారీని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు మంగళవారం సీజ్‌చేసి డ్రైవర్‌ను అరెస్టుచేశారు. ఈ నెల 28వ తేదీ అర్ధరాత్రి అద్దంకి- నార్కట్‌పల్లిరోడ్డుపై మిర్యాలగూడ వద్ద కారును ఏపీ రాష్ట్రం వైపు వెళ్తున్న పొట్టులారీ ఢీ కొట్టిన సంఘటనలో ఆరుగురు మృతిచెందిన సంఘటన విదితమే. ప్రమాదం జరిగిన తరువాత పోలీసులకు చిక్కకుండా లారీని డ్రైవర్ ఏపీ రాష్ట్రంలోకి ప్రవేశించాడు. దీంతో ప్రమాదానికి కారణమైన లారీని గుర్తించేందుకు సీసీకెమెరాల ఫుటేజీలు కీలకంగా మారాయి, ఫుటేజీల ఆధారంగా పరారీలో ఉన్న లారీని అద్దంకి వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కేసునమోదు చేశారు. కాగా పోలీసులు సీజ్ చేసినలారీని డీఎస్పీ వెంకటగిరి పరిశీలించారు. లారీ ముందు భాగంలో దళసరి ఐరన్‌బంపర్ కారును ఈడ్చుకెళ్లడంతో ప్రమాద తీవ్రత పెరిగినట్లు నిర్ధారించారు. లారీని వెంబడించి పట్టుకున్న ఎస్‌ఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీస్ బృందాన్ని ఆయన అభినందించారు.

పొగమంచుకు లైట్ల వెళుతురులో వెలుతున్న వాహనాలు





రహదారి పక్కన దట్టమైన పొగమంచు కారణంగా కనిపించని చెట్లు

కప్పేసిన మంచుదుప్పటి

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పట్టిమర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిని మంగళవారం మంచు దుప్పటి కప్పేసింది. ఉదయం 9గంటల సమయంలోనూ జాతీయ రహదారిపై దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో లైట్ల వెలుతురులో నెమ్మదిగా ముందుకు సాగారు. కొందరు వాహనాలను రోడ్డు పక్కకు ఆపి పొగమంచు తగ్గాక బయలుదేరారు. ఉదయపు నడకకు వెళ్లేవారు సైతం మంచు తగ్గుముఖం పట్టాక బయటకు వచ్చారు. కనువిందు చేసిన మంచు దృశ్యాలను ప్రకృతి ప్రేమికులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

● చిట్యాలరూరల్.

నల్లగొండను ఎండబెడతారా..? : జూలకంటి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 30: ఇతర జిల్లాలకు సాగర్ నీరు వీడుదల చేసి నల్లగొండను ఎండబెడతారా అని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు తాగునీరు, ఖమ్మం జిల్లా పాలేరుకు ఎడమకాల్వ ద్వారా నీరు విడుదల చేసేందుకు చర్యలు చేపడుతూ ప్రాజెక్టు ఉన్న నల్లగొండ జిల్లాను ఎండబెట్టడం సరికాదన్నారు. నల్లగొండ జిల్లా ప్రజలకు సాగునీటి, తాగునీటి ఎద్దడి రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా మంత్రులపై ఉందన్నారు. ఎస్ఎల్‌బీసీ కింద నల్లగొండ, నకిరేకల్ ఎడమకాల్వకింద నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతులు బోరుబావుల కింద సాగుచేసిన వరి పొలాలు పొట్టదశలో నీరు లేక ఎండిపోతున్నాయన్నారు. పంటను రక్షించుకోకుంటే రైస్‌మిల్లులు మూతపడే ప్రమాదం ఉందన్నారు. బియ్యం ధరలు పెరిగి సామాన్యులకు భారంగా మారుతోందన్నారు. గతంలో సాగర్ నీటిమట్టం 505అడుగులు ఉన్నప్పుడు కూడా ఎడమకాల్వకు నీరు విడుదల చేసి చెరువులు కుంటలు నింపిన సంఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం 520అడుగులు ప్రాజెక్టులో నీరు ఉన్నందున పది రోజులపాటు సాగర్ ఎడమకాల్వకు, ఎస్ఎల్‌బీసీ, వరదకాల్వలకు నీరు విడుదల చేసి చెరువులను, కుంటలను నీటితో నింపాలన్నారు. పలు చోట్ల మిషన్‌భగీరథ నీరందక ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడుతుందన్నారు. ఎడమకాల్వ ద్వారా చెరువులను నింపితే భూగర్భజలాలు పెరిగి బోరుబావుల కింద సాగు చేసిన పొలాలను రక్షించవచ్చునని అన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను కలిసి చర్చించినట్లు తెలిపారు. ఎడమకాల్వపై నున్న మేజర్, మైనర్ కాల్వల తూముల వద్ద అధికారులను కాపలాఉంచి ఖమ్మం జిల్లా పాలేరుకు తరలిస్తామనడం సరికాదన్నారు. నల్లగొండ జిల్లాలోని చెరువులను సాగర్ నీటిద్వారా నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న సాగర్‌లోని ప్రాజెక్టు సీఈ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు జిల్లా వ్యాప్తంగా రైతులు కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, తిరుపతి రాంమూర్తి, జగదీశ్‌చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి, భావాండ్ల పాండు, వినోద్ నాయక్, పరుశరాములు, పగిడోజు రాంమూర్తి, పాపానాయక్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, జనవరి 30: నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామానికి చెందిన కిన్నెర బక్కయ్య, పూలమ్మ దంపతుల కుమారుడు కిన్నెర మధు(35) మరొకరితో కలిసి ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై వెళుతున్నారు. పెద్దకాపర్తి శివారులో 7మిడ్‌వే హోటల్ ఎదురుగా ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. దీంతో మధుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బద్రికి తీవ్ర గాయాలు కాగా ఆంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు. కనగల్ మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన ఇటివాల శ్రీను, భార్య కళమ్మ(37) ఈ నెల 29న చెర్వుగట్టుకు వచ్చి శ్రీపార్వతీదేవి ఆలయ ఆవరణ సమీపంలో నిద్రించారు. హైదరాబాద్‌కు చెందిన ఏపీ 29వి9122 నంబరుగల ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును డ్రైవర్ అబ్దుల్ అజాగ్రత్తగా నడిపి నిద్రిస్తున్న కళమ్మ పైనుంచి వెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. కళమ్మ భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

ఆశ కార్యకర్త ఆత్మాహత్యాయత్నం



ఆశ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నిడమనూరు, జనవరి 30: కాంగ్రెస్ పార్టీ నాయకుడు తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ ఆశ కార్యకర్త ఎమ్మెల్యే సమక్షంలో ఆత్మాహత్యాయత్నం చేసింది. మంగళవారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని పార్వతీపురంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం గ్రామస్థులు ఇటీవల విషజ్వరాల బారిన పడడంతో గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధికారులు, వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. అదే సమ యంలో గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త సంకూరి వెంకటలక్ష్మి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం తనను వేదిస్తున్నాడని ఆరోపిస్తూ సమావేశంలోనే బ్లేడుతో ఎడమ చేతి ముంజేయి భాగంలో కోసుకుంది. ఈ చర్యతో ఒక్కసారిగా సమీక్షలో అలజడి రేగింది. వైద్య సిబ్బంది వెంటనే ఆమెకు చికిత్స చేసి ఇంటికి పంపారు. త్రిపురారంలో సమావేశం ఉండ దంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆశ కార్యకర్త నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆత్మాహత్యాయత్నానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు తనను ఇబ్బందులు పెడుతూ, తనపై తరచూ అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నందుకే ఆత్మాహత్యాయత్నం చేసినట్లు ఆమె ఆరోపించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నేత అంకతి సత్యం వివరణ ఇస్తూ ఆశ కార్యకర్తను తాను ఎప్పుడూ ఇబ్బందులు పెట్టలేదని, గ్రామంలో విషజ్వరాలు ఉన్నందున నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించానని చెప్పారు. ఆశ కార్యకర్త చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు.

వారంలో మరో మూడు గ్యారంటీల అమలు

● ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

తుర్కపల్లి, జనవరి 30: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా వారం రోజుల్లో మరో మూడు గ్యారంటీలు అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. తుర్కపల్లి మండలం కొండాపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన ఎస్సీ కమ్యూనిటీ భవనాలను ఆయన మంగళవారం ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం మీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. దశల వారీగా అన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. కొండాపూర్ గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్, బతుకమ్మ బండ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురం గ్రామంలో దుర్గమ్మ గుడి కట్టించాలని గ్రామస్థులు విప్‌ను ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, ఎంపీటీసీ కానుగంటి శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్‌లు దొనికెని మల్లేశం, కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దానావతు శంకర్‌నాయక్, నాయకులు కొమిరిశెట్టి నర్సింహులు, చాడ భాస్కర్‌రెడ్డి, కొన్నె దుర్వాసులు, గణేష్ పాల్గొన్నారు. అనంతరం భువనగిరి-గజ్వేల్ రహదారిపై జేతురాంతండ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు కాలువ మూల మలుపును బీర్ల అయిలయ్య పరిశీలించారు. నేషనల్ హైవే ఈఈ, ఆర్‌అండ్‌బీ, ట్రాఫిక్ ఏసీపీతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదాలు జరుగకుండా బ్యారికేడ్స్, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రుస్తాపూర్ గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని వగ్గు పూజారులు నిర్వహించారు. బీర్ల అయిలయ్యను సన్మానించారు.



తుర్కపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య



యాదగిరిగుట్టలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

యాదగిరిగుట్ట రూరల్: సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. గుట్ట మండలం వండలం వంగపల్లి రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర రైతు సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆలేరు నియోజవకవర్గం స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాటి కాలంలో రైతులు ఆవులు, గేదెలు, మేకలు, గొర్లు జంతువుల పేడ వాడకం ద్వారా పంటలు సాగు చేసేవారని, దీంతో ప్రజలు 100ఏళ్లు బతికేవారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, ఎంపీపీ చీర శ్రీశైలం, సర్పంచ్‌లు కానుగు కవితబాలరాజ్‌గౌడ్, నెమిలె రాజ్యలక్ష్మీరాంచదర్, బీమగాని రాములుగౌడ్, సంఘం జిల్లా అధ్యక్షుడు కేతావత్ మహేందర్‌నాయక్ పాల్గొన్నారు. ఫిబ్రవరి 3నుంచి 4వ తేదీ వరకు కాచారం గ్రామంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడల కరపత్రాన్ని ఆయన ఎమ్మెల్యే ఆవిష్కరించారు. రగ్బీ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీబీనగర్ లక్ష్మణ్, టీడీపీ నియోజకవర్గం కో కన్వీనర్ రేగు బాలనర్సయ్య, పీఈటీలు ఆకుల శ్రీనివాస్, మంగళగిరి నరేష్, బర్మ మనోహర్, సుంచు బాలేష్, సుంచు వినోద్ పాల్గొన్నారు. గుట్ట ఎంపీపీ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే అయిలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ చీర శ్రీశైలం, మున్సిపల్ చైర్ పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, డాక్టర్ ఎం. గిరిధర్, నాయకులు కానుగు బాలరాజ్‌గౌడ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశం, బందారపు భిక్షపతిగౌడ్, గుండ్లపల్లి నర్సింహ్మగౌడ్ పాల్గొన్నారు. కొండపైన వర్తక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అయిలయ్యను సంఘం నాయకులు, సభ్యులు పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం 'ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన' పుస్తకాన్ని ఎమ్మెల్యే తన స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజా పర్యవేక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం, కేసరి యూత్ క్లబ్ అధ్యక్షుడు రేగు బాల నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ డిగ్రీలో ప్రవేశానికి నేడు చివరి గడువు

రామన్నపేట, జనవరి 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రథమ సంవత్సరంలో చేరడానికి ఈ నెల 31 వరకు అవకాశం ఉంటుందని, ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్‌ఖాన్, కోఆర్డినేటర్ డి.మక్లా మంగళవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం తరగతులు ఫిబ్రవరి 4నుంచి మార్చి 3వరకు కళాశాలలో ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 7382929781 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

భువనగిరి అర్బన్, జనవరి 30: వచ్చే నెల నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ నోడల్ అధికారి సి.రమణి మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీనుంచి 15 వరకు ప్రాక్టికల్, 16న ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్, 17న ఎథిక్స్, మానవ విలువలకు సంబంధించిన పరీక్ష, 19నఎన్విరాన్‌మెంట్, 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతాయన్నారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు వివరించారు.

19న వెల్లంకి గ్రామానికి గవర్నర్ రాక

రామన్నపేట, జనవరి 30: రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందర్య రాజన్ రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి ఫిబ్రవరి 19న హాజరు కానున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆచార్య కూరెళ్ల గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించనున్నారు.

సర్పంచ్ పదవి ముళ్ల కిరీటం లాంటిది



నెమిల గ్రామ సర్పంచ్ మమతారమేష్‌ను సన్మానిస్తున్న పాశం భాస్కర్

రాజాపేట, జనవరి 30: సర్పంచ్ పదవి ముళ్ల కిరీటం లాంటిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అన్నారు. మంగళవారం రాజాపేట మండలం నెమిల గ్రామంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం పదవీ వీడ్కోలు సన్మాన సభను గ్రామస్థులు నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పాలక వర్గం ఐదేళ్లు విజయవంతంగా పదవీ బాధ్యతలను పూర్తి చేసి, గ్రామాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఊట్కూరి అశోక్‌గౌడ్, మండల అధ్యక్షులు కాయితి బాల్‌రెడ్డి, నాయకులు సత్యానారాయణ, రాజు, రమేష్, శివ, పంచాయతీ కార్యదర్శి భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు. పాశం భాస్కర్‌ను బీజేపీ రాజాపేట మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నాయకులు బాల్‌రెడ్డి, అశోక్‌గౌడ్, రాజు, రమేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సంస్థాన్ నారాయణపురం జనవరి 30: గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి పందుల యాదగిరిగౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం గీత కార్మిక సంఘం సమావేశం జరిగింది. ఈసందర్భంగా యాదగిరి గౌడ్ మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఆయన కోరారు. గీత వృత్తిని కాపాడేందుకు చిన్నతాటి చెట్లను ఉత్పత్తి చేసేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు తండా యాదయ్య ,మోగదాల సత్తయ్య, వీరమల్ల యాదయ్య, నీళ్ల గాలయ్య,పెద్దగోని విష్ణు, బొమ్మగోని చంద్రయ్య,మారగోని స్వామి,బాలగోని దశరథ,బాలగోని మల్లేష్,దూసరి నారాయణ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రామన్నపేట, జనవరి 30: మండలంలోని బి తుర్కపల్లి గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు రెండు ట్రాక్టర్లను రామన్నపేట పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఏఎస్ఐ కుంచం శ్రీనివాస్ తెలిపారు. మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తోడుతున్నారని సమాచారం రావడంతో తమ సిబ్బంది వాగు శివారు వద్దకు వెళ్లగా బి.తుర్కపల్లి గ్రామానికి చెందిన నల్లబోతు గణేష్, నల్లబోతు అంజయ్య ట్రాక్టర్లు వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తోడుతున్నారని దీంతో రెండు ట్రాక్టర్లను స్వాధీనపరుచుకుని, కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహాత్మాగాంధీ జీవితం ఆదర్శనీయం



ఆత్మకూరు(ఎం): గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరి టౌన్, జనవరి 30: మహాత్మాగాంధీ జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం భువనగిరిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించి, మాట్లాడారు. మహాత్మాగాంధీ సాధించి పెట్టిన దేశ స్వాతంత్ర్యంతో భారతీయుల అభివృద్ధి, గుర్తింపు సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు కూర వెంకటేశ్, టీపీసీసీ సభ్యుడు తంగళ్ళపల్లి రవి కుమార్, మునిసిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఈరపాక నర్సింహ, వెంకటేశ్, ప్రదీప్ పాల్గొన్నారు.

రాజాపేట: మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అఖిలపక్ష నాయకులు మహేందర్‌గౌడ్, అశోక్‌గౌడ్, శ్రీశైలం, కేధారి, నవీన్‌కుమార్, ప్రశాంత్, పోచయ్య, కిష్టయ్య, వెంకటేష్, శ్రీను ఉన్నారు.

చౌటుప్పల్ టౌన్ : మహాత్మా గాంధీ ఆశయాలను సాధించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ సుధాకర్ కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని గాంధీజీ విగ్రహానికి బోయ సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జై భారత్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెంకట్, అభిలాష్, శశికుమార్ పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మహాత్మాగాంధీ వర్ధంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహాత్మాగాంధీ చిత్రపటానికి పోలీసు సిబ్బంది, మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి ఆర్య వైశ్య సంఘం, కాంగ్రెస్, శివాజీ యువజన మండలాల సభ్యులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.నాగరాజు, ఏఎస్ఐ సైదులు పోలీస్ సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం నాయకులు, పి.నర్సయ్య, టి.హరినాథం, ఎం.మల్లేశం, డి.రమేష్, డి.నాగయ్య, ఎం, రాజు, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శివాజీ యూత్ అధ్యక్ష కార్యదర్శులు కొరె మల్లేశం, మజ్జిగ నరేష్ పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి



మోత్కూరు: గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

మోత్కూరు, జనవరి 30: కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మోత్కూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్ అన్నారు. ఈ నెల 30నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్టువ్యాధిపై నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పీహెచ్‌సీలో ప్రారంభించి మాట్లాడారు. కోర్సు ప్రకారం మందులు వాడితే కుష్టువ్యాధి త్వరలోనే తగ్గుతుందన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఏఎన్ఎంలు పలు చోట్ల విద్యార్థులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించి వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సు స్లీవా, సూపర్‌వైజర్ కృష్ణ, ఏఎన్ఎంలు రాములమ్మ, సైదమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ జనార్ధన్, మధు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి మాట్లాడుతూ కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ వ్యాధి నిర్మూలనకు వ్యాధి గ్రస్తులు పూర్తిస్థాయి చికిత్స తీసుకుంటే వ్యాధి నయమవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ ఉపాధికారి యశోధ, మండల వైద్యాధికారి శ్రీవాణి, జిల్లా డీపీఎంవోఎస్ బసవరాజ్, సతీష్, జ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు భవాని, లక్ష్మణ్, వాణి పాల్గొన్నారు.

స్టాక్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

చౌటుప్పల్ టౌన్, జనవరి 30: ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చౌటుప్పల్ ఏవో ముత్యాల నాగరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ ఇన్‌వెంటర్ స్కీమ్ కింద మంగళవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఏవో నాగరాజు తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. యూరియా, డీఏపీ నిల్వల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో నాగరాజు మాట్లాడుతూ వారం రోజుల్లో మండలంలోని అన్ని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి యూరియా, డీఏపీ నిల్వల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఆయన తెలిపారు. ప్రతీ వారం క్రమం తప్పకుండా దుకాణాల్లోని ఎరువుల నిల్వలను తనిఖీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఈ ప్రాంతంలోని రైతులకు సరిపడా యూరియా, డీఏపీ నిల్వలు ఉన్నాయా లేదా అన్న వివరాలను వ్యవసాయ శాఖ కమిషనర్ సమీక్షిస్తారని, ఒక వేళ ఎరువులు తక్కువగా ఉంటే వెంటనే సంబంధిత ప్రాంతాల్లోని దుకాణాలకు అలాట్‌మెంట్ ఇస్తారని, దీంతో రైతులకు ఎరువుల కొరతను నివారించే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

సంక్షిప్త సమాచారం...

భువనగిరి టౌన్: కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా భువనగిరి పట్టణానికి చెందిన దేవరకొండ మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు దర్గాయి హరిప్రసాద్ నియామకం ఉత్తర్వులు అందజేశారు. దళితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని నూతన కన్వీనర్ అన్నారు. కాగా మహేష్‌ను పలువురు అభినందించారు.

మోత్కూరు : మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన గొలుసుల యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. పదో వార్డు కౌన్సిలర్ బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందించారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, మండల నాయకుడు బద్దం నాగార్జునరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు.

చౌటుప్పల్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దివీస్ అందజేస్తున్న చేయూత అభినందనీయమని చింతలగూడెం సర్పంచ్ ఆవుల రేణుక అన్నారు. చింతలగూడెం, దామెర ప్రభుత్వ పాఠశాలలో దివీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్కూల్ బ్యాగులు, పాదరక్షలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, గ్రామాభివృద్ధికి దివీస్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయంత్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఉపేంద్ర, దివీస్ ప్రతినిధులు వెంకటరాజు, సాయికృష్ణ పాల్గొన్నారు.

మోత్కూరు : 50 ఏళ్లు నిండిన విశ్వకర్మలకు ప్రభుత్వం చేయూత పథకం వర్తింపజేయాలని విశ్వబ్రాహ్మణ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారోజు సోమాచారి డిమాండ్ చేశారు. ఈ నెల 31న తిరుమలగిరిలో నిర్వహించనున్న మారోజు వీరన్న 62వ జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను మోత్కూరులో ఆయన విడుదల చేసి మాట్లాడారు. మారోజు వీరన్న పోరాట స్ఫూర్తితో పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. విశ్వకర్మలు అధిక సంఖ్యలో పాల్గొని వీరన్న జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మారోజు వీరన్న సోదరుడు పాండు, విశ్వకర్మ సంఘం మోత్కూరు మండల అధ్యక్షుడు ఎ.వెంకటాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లోజు శివ, మోత్కూరు నవీన్, బ్రహ్మాచారి, డి.సత్యనారాయణాచారి, వెంకన్న, చారి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం సమావేశం జరిగింది. ఈసందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను రజక వృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ రాచకొండ రమేష్ బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక రిజర్వేషన్ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు, శ్రీ వెంకటేశ్వర రజక సహకార సంఘం అధ్యక్షుడు ఉప్పల వెంకటేష్, నాయకులు ఉప్పల ఆంజనేయులు, ఏపూరి సతీష్, ఉప్పల కృష్ణ, ఉప్పల శ్రీను, ఉప్పల రాజయ్య, ఏపూరి గోపాలు, రాములు పాల్గొన్నారు.

రామన్నపేట: రామన్నపేట సీఐ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ ఎన్.వెంకటేశ్వర్లుని మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రామిని లక్ష్మణ్, లవణం రాము, ఎండి ఎజాస్, ముగ్గు నర్సింహ పాల్గొన్నారు.

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామంలో రైతు మేక అశోక్‌రెడ్డి ఆయిల్ పాం క్షేత్రంలో ఆయిల్ పాం సాగుపై పలువురు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీఎస్ ఆయిల్ ఫెడ్ రాష్ట్ర టెక్నికల్ అడ్వైజర్ బి.రాజశేఖర్‌రెడ్డి అవగాహన సదస్సులో మాట్లాడుతూ ఆయిల్ పాం సాగుపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా కోఆర్డినేటర్ ఏ.ప్రవీణ్‌కుమార్, మండల ఫీల్డ్ ఆఫీసర్ వై.ప్రశాంత్, రైతులు జనార్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుదేష్ పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇంటినిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కోట రాంచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆయన సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, గూడూరు అంజిరెడ్డి, మంచాల మధు, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

భువనగిరి టౌన్, జనవరి 30: నిరుద్యోగ యువతకు ఉద్యోగాలైన ఇవ్వాలి.. లేని పక్షంలో నిరుద్యోగ భృతినైనా ఇవ్వాలి అని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. మంగళవారం భువనగిరిలో జరిగిన ఏఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలలను భర్తీ చేయకపోతుండటంతో నిరుద్యోగులు నష్టపోతున్నారని అదే సమయంలో ఉద్యోగుల కొరతతో ప్రభుత్వ సేవలకు అంతరాయం కలుగుతూ, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం నిధులతో జిల్లాలో యునివర్సిటీ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని బస్వాపూర్ ప్రాజెక్ట్‌తో సహా సాగునీటి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉప్పల శాంతికుమార్, పెరబోయిన మహేందర్, వస్తువుల అభిలాష్, ఎండి. నయీం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాబృందం

మోత్కూరు, జనవరి 30: సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని రాచకొండ కమిషనరేట్ యాదాద్రి జోన్ జాగృతి పోలీస్ కళాబృందం లీడర్ బి.కృష్ణ కోరారు. మంగళవారం మండలంలోని కొండగడప ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, డయల్ 100, 1930 నంబర్ల ఉపయోగంపై కళాకారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం. ఎం.శ్యామల, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, హనుమంతు, రవీందర్‌రెడ్డి, భవాని, పుష్పలత పాల్గొన్నారు.

సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి: సీపీఎం

మోత్కూరు, జనవరి 30: సర్పంచుల పదవీ కాలం ఈ నెల 31తో పూర్తవుతున్నందున వారికి పెండింగ్ బిల్లులు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మంగళవారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో అధికారులు సర్పంచులపై ఒత్తిడి తెచ్చి పల్లె ప్రకృతి వనాలు, పారిశుధ్య నిర్వహణకు ట్రాక్టర్లు, శ్మశాన వాటికలు, రహదారుల నిర్మాణం లాంటి పనులు చేయించారన్నారు. సర్పంచులు తమ వద్ద డబ్బులు లేక వడ్డీలకు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినందున వారు పదవి నుంచి దిగిపోతున్నందున వెంటనే వారికి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన నిర్ణయాన్ని పునరాలోచించి, సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలని కోరారు.

సీనియర్ న్యాయవాది ఆంజనేయులు మృతి



ఆంజనేయులు(ఫైల్)

భువనగిరి టౌన్, జనవరి 30: మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, భువనగిరి పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఆకుల అంజనేయులు (59) మంగళవారం మృతి చెందాడు. మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి సన్నాహాలు చేస్తున్న సందర్భంలో అతని సన్నిహితుల్లో ఒకరిగా ఆంజనేయులు ప్రసిద్ధి పొందారు. అప్పట్లో కేసీఆర్ హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్లిన ప్రతిసారి భువనగిరిలో ఆగి అంజనేయులుతో మాట్లాడి, చాయ్ తాగి వెళ్లేవారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన ఆంజనేయులు చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు



బహుమతి అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్ టౌన్, జనవరి 30: వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్థానిక జేబీఎం ఒకేషనల్ కాలేజీ విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, అంకిత భావంతో చదువుకుని, మంచి ఫలితాలు సాధించాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థిని భార్గవిని చైర్మన్ రాజు అభినందించి, బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, పంతంగి సర్పంచ్ బాతరాజు సత్యం, కాలేజీ ప్రిన్సిపాల్ గంగాపురం జంగయ్య పాల్గొన్నారు.

జీఎంఆర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

చౌటుప్పల్ రూరల్ జనవరి 30: చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, సన్‌రైజ్ అసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం డ్రైవర్లను ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో మేనేజర్ సురేష్, సంతోష్‌కుమార్, భాను ప్రసాద్, నాగకృష్ణ, సాంబశివరావు, రామకృష్ణ , ప్రవీణ్‌రెడ్డి, కల్పన, సంగీత పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



బసంతాపూర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పూరి గుడిసె

రాజాపేట, జనవరి 30: మండలంలోని బసంతాపూర్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమై సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగింది. మంగళవారం బసంతాపూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ రాజుకు చెందిన పూరిగుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఇంట్లో ఉన్న నిత్యవసర వస్తువులు, బట్టలు, కుట్టు మిషన్, సర్టిఫికెట్లు దగ్ధమయ్యాయి. దీంతో రూ.2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర నాయకులు వట్టిపల్లి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఊట్కూరి అశోక్‌గౌడ్, సందర్శించి రాజు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని బేగంపేటకు చెందిన జెల్ల పరమేష్ రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.